శ్రామికవర్గ సంక్షేమమే
మా ఆశయం



మేడే పార్కులో శ్రామికుల సంస్మరణ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు, ఎంపీలు తదితరులు

- వారికి ఎప్పుడూ అండగా ఉంటాం
- ద్రావిడులంటే కార్మికులే
- మేడే వేడుకల్లో సీఎం స్టాలిన్

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): కాయకష్టం చేసేవారంతా కార్మికులేనని, వారి సంక్షేమమే డీఎంకే ప్రభుత్వ ప్రధాన ఆశయమని, ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. చింతాద్రిపేటలోని మేడే పార్కులో గురువారం ఉదయం కార్మిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ... రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడల్లా కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఉంటుందని, కార్మిక దినం జరుపుకునేందుకు నగరంలో మేడే పార్కును, అందులో శ్రామికవర్గం చిహ్నాన్ని ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికే దక్కుతుందన్నారు. నాలుగేళ్ల వ్యవధిలో 28లక్షలకు పైగా అసంఘటిత కార్మికులకు రూ.2,461 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు.. ఆహారం డెలివరీ చేసే జీఐజీ (గిగ్) కార్మికులకు, రాష్ట్ర ఉప్పుకయ్యల కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. అసలు ద్రావిడులంటేనే కార్మికులని, పెరియార్ రష్యా పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగొచ్చిన మీదట పార్టీ శ్రేణులను ఇకపై 'తోళర్‌గళ్' (కామ్రేడ్లు) అనే పిలుస్తానని చెప్పారని స్టాలిన్ గుర్తు చేశారు.. విదేశాలలో కార్మికుల పనిగంటలు తగ్గించాలని ఉద్యమాలు జరగటానికి ముందే జస్టిస్ పార్టీ అధ్యక్షుడు టీఎం నాయర్ కార్మికుల పనిగంటలను రోజుకు 12 గంటలకు తగ్గించాలని పోరాడినట్లు తెలిపారు. 1967లో డీఎంకే తొలిసారిగా అధికారంలోకి వచ్చినప్పుడు మేడేని వేతనంతో కూడిన సెలవుదినంగా అప్పటి ముఖ్యమంత్రి అన్నాదురై ప్రకటించారన్నారు. చెన్నైలో కార్ల్ మార్క్స్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల శాసనసభలో ప్రకటించామని, త్వరలోనే ఆ విగ్రహం కూడా ఏర్పాటవుతుందని చెప్పారు. కాయకష్టం చేసే కార్మికులందరికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. ఈ వేడుకల్లో డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్ బాలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, డీఎంకే కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎంపీ షణ్ముగం, అధ్యక్షుడు నటరాజన్, కోశాధికారి పళల్వాన్ పార్టీ కార్మిక విభాగం కార్యదర్శి సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2689 కోట్లతో
తిరువళ్లూరు- శ్రీపెరుంబుదూరు ఫోర్‌వే

- నిర్మాణపనులకు డిప్యూటీ సీఎం శ్రీకారం



రహదారి పనులను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై నగర సరిహద్దు రహదారుల అభివృద్ధి పథకం కింది తిరువళ్లూరు బైపాస్ నుంచి శ్రీపెరుంబుదూరు వరకు 30.10 కి.మీ. మేర సిక్స్ వే రోడ్డు నిర్మాణ పనులకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి గురువారం ఉదయం శ్రీకారం చుట్టారు. రూ.2689.74 కోట్లతో ఈ రోడ్డును నిర్మించనున్నారు. తిరువళ్లూరు జిల్లా ఈక్కాట్టు కండిగ వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ రహదారి పనులను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ.. తిరువళ్లూరు బైపాస్ నుండి వెంగళత్తూరు వరకు 10.40 కి.మీ రహదారి పనులను రూ.1,133.కోట్లతో, వెంగళత్తూరు నుంచి చెంగాడు వరకు 10.కి.మీల రహదారి పనులను రూ. 593.27 కోట్లతోను, చెంగాడు నుంచి శ్రీపెరుంబుదూరు వరకు 9.70 కి.మీల రహదారి పనులను రూ.963.24 కోట్లతోనూ చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపనులు, రహదారులు, మినీ ఓడరేవుల శాఖ మంత్రి ఈవీ వేలు, మైనారిటీ సంక్షేమం, ప్రవాస తమిళుల సంక్షేమశాఖ మంత్రి ఎస్ఎం.నాజర్, ఎమ్మెల్యేలు ఎ.కృష్ణసామి, వీజీ రాజేంద్రన్, ఎస్.చంద్రన్, రహదారులు, మినీ ఓడరేవుల శాఖ కార్యదర్శి డాక్టర్ ఇరా సెల్వరాజ్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.భాస్కరపాండ్యన్, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎం.ప్రతాప్, రహదారుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.పళనివేల్ తదితరులు పాల్గొన్నారు.



రామానుజుల రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం

నేత్రపర్వంగా రామానుజుల
రథోత్సవం

ప్యారీస్, మే 1 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూర్‌లో రామానుజుల 108వ అవతార ఉత్సవ రథోత్సవం గురువారం ఉదయం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద హారతి అనంతరం రామానుజుల వారు ఆశీనులైన రథం భక్తుల గోవిందనామ స్మరణ మధ్య కదిలింది. తేరెడివీధి, తిరువళ్లూరు వీధి, తిరుమంగై ఆళ్వార్ వీధితో పాటు ప్రధాన వీధుల మీదుగా సుమారు 2 కిలోమీటర్ల మేర సాగిన ఈ రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎండలు మండుతుండటంతో భక్తుల దాహార్తి తీర్చేందుకు పలు ఆధ్యాత్మిక సంస్థలు మజ్జిగ, నీరు, పుచ్చకాయలను పంపిణీ చేశాయి. శ్రీపెరంబదూర్‌లో దాదాపు మూడువేల ఏళ్ళ చరిత్ర కలిగిన పురాతన ఆదికేశవ పెరుమాళ్ ఆలయాన్ని ఏడాది పొడవునా భక్తులు, పర్యాటకులు సందర్శిస్తుంటారు. భూతపురి క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ ప్రాంగణంలోనే రామానుజుల వారు చైత్రమాసంలో 1017వ సంవత్సరం జన్మించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది, స్థానికులు ఆదికేశవ పెరుమాళ్‌ను పెద్దన్న అని, వైష్ణవంలో జన్మించి ఆ రోజుల్లో సమాజానికి కనువిప్పు కలిగించిన శ్రీరామానుజుల వారిని చిన్నన్న అని పిలుస్తూ పూజిస్తున్నారు. రామానుజుల సహస్రాబ్ది అవతార ఉత్సవం చిత్తిరై బ్రహ్మోత్సవాల పేరుతో గత నెల 22న ధ్వజారోహణంతో ప్రారంభమైంది.. అప్పటి నుండి బంగారు పల్లకీ, మంగళగిరి వైభవం, సింహ, అశ్వవాహనాల్లో రామానుజుల వారు విహరించారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టంగా 50 అడుగుల ఎత్తైన రథంలో అలంకరించిన రామానుజుల వారిని కొలువుదీర్చారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు మధ్య సాగిన ఈ రథోత్సవంలో రాష్ట్రంనుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రద్దీలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హైకోర్టు న్యాయమూర్తులకు ఘన వీడ్కోలు



పదవీ విరమణ చేయనున్న న్యాయమూర్తులు

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టులో పదవీ విరమణ చేయనున్న ఐదుగురు న్యాయమూర్తులకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరాం నేతృత్వంలో ఘనంగా వీడ్కోలు పలికారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఆర్.హేమలత బుధవారం పదవీవిరమణ చేశారు. అలాగే, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ సుందర్ శుక్రవారం (మే 2వ తేది), న్యాయమూర్తి జస్టిస్ ఏఏ నక్కీరన్ ఈ నెల 9, న్యాయమూర్తి జస్టిస్ వి.భవాని సుబ్బరాయన్ ఈ నెల 16న, న్యాయమూర్తి జస్టిస్ వి.శివజ్ఞానం ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. మద్రాసు హైకోర్టుకు ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఐదుగురు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ నేతృత్వంలో బుధవారం సాయంత్రం హైకోర్టు ఆడిటోరియంలో వీడ్కోలు సభ నిర్వహించారు. అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ ఐదుగురు న్యాయమూర్తుల సేవలను కొనియాడారు. అనంతరం ఐదుగురు న్యాయమూర్తులు తమ స్పందన తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పదవీవిరమణ చేసే న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో
మేడే వేడుకలు



సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆ పార్టీ నేతలు జి.రామకృష్ణ, రాజశేఖరన్ తదితరులు

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో కార్మికులు గురువారం ఉదయం మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చెన్నైలో ఆటో కార్మికులు, వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు మిఠాయిలు పంచి ఘనంగా మేడే నిర్వహించారు. ఇదే విధంగా వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో కూడా కార్మికుల దినోత్సవం వేడుకలు జరిగాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చింతాద్రిపేటలోని మేడే పార్కులో జరిగిన కార్మికుల దినోత్సవంలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా ఎగ్మూరులోని ఎండీఎంకే ప్రధాన కార్యాలయం తాయగమ్ వద్ద జరిగిన వేడుకల్లో ఆ పార్టీ నేత వైగో తదితరులు పాల్గొన్నారు. టి.నగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద మేడే వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో పార్టీ నేతలు జి.రామకృష్ణ, వి.రాజశేఖరన్, ఏవీ సింగా వేలన్, డి విల్సన్, ఆర్.కదిర్, శరవణన్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయంలో సీనియర్ నేత నల్లకన్ను పతాకవిష్కరణ చేశారు. పార్టీ నేతలు ముత్తరసన్ తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ ఆధ్వర్యంలో అంబత్తూరులో మేడే వేడుకలు జరిగాయి. పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ జెండా ఎగురవేసి, కార్మికులకు సహాయకాలు అందజేశారు. పార్టీ నేతలు విడియల్ శేఖర్, జీఆర్ వెంకటేష్, జవహర్‌బాబు, తిరువేంగడం తదివతరులు పాల్గొన్నారు. డీపీఐ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పార్టీ ప్రముఖులు బాలసింగం, సారనాథ్, చెట్‌పట్ ఇలంగో, సెల్వం తదితరులు పాల్గొన్నారు.



అంబత్తూరులో టీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో కార్మికులకు సహాయాలు అందజేస్తున్న పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ తదితరులు

మదురైలో విజయ్‌కి ఘనస్వాగతం

- వేకువజామునే గుమికూడిన అభిమానులు
- మాట వినని పార్టీ శ్రేణులు





మదురై విమానాశ్రయం వద్ద టీవీకే నేత విజయ్‌కి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో సినిమా షూటింగ్ కోసం వెళ్తూ మదురై విమానాశ్రయం వద్ద ఆగిన తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్‌కి పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. విజయ్ షూటింగ్ కోసం గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మదురై విమానాశ్రయం చేరుకుంటారని ముందే తెలుసుకున్న వేలాది మంది కార్యకర్తలు వేకువజామునే విమానాశ్రయం వద్ద గుమికూడారు. దీంతో వారిని అదుపు చేయడం పోలీసులకు కష్టమైంది. అదే సమయంలో విజయ్ రోడ్‌షో జరపాలని నిర్ణయించడం వల్లే పార్టీ శ్రేణులు భారీ యెత్తున గుమికూడినట్లు పుకార్లు వ్యాపించాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు తమ అనుమతి లేకుండా విజయ్ రోడ్‌షో చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతే కాకుండా విమానాశ్రయం వద్ద సమయం గడుస్తున్న కొద్దీ కార్యకర్తల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ విషయం చెన్నైలో ఉన్న విజయ్‌కు తెలిసింది. వెంటనే మీనంబాక్కం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ మదురై విమానాశ్రయం వద్ద అభిమానులు పెద్ద సంఖ్యలో గుమికూడినట్లు తెలుసుకుని సంతోషిస్తున్నానని, అయితే తానిప్పుడు 'జననాయగన్' సినిమా షూటింగ్ కోసం కొడైకెనాల్ వెళుతున్నానని, అది తన వ్యక్తిగత పర్యటన అని విమానంలో మదురై చేరుకుని అక్కడి నుండి వ్యాన్‌లో కొడైకెనాల్ వెళ్తున్నానని, పార్టీ శ్రేణులు ఎలాంటి హడావుడి చేయకపోవడమే మంచిదని చెప్పారు. మదురైలోని పార్టీ శ్రేణులను తాను త్వరలో కలుసుకుంటానని, ఎయిర్‌పోర్ట్ నుంచి పార్టీ శ్రేణులంతా వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నానని, మదురై ఎయిర్‌పోర్ట్ నుండి కొడైకెనాల్‌కు వ్యాన్‌లో వెళ్తున్నానని, పార్టీ శ్రేణులెవరూ తన వాహనాన్ని వెంబడించవద్దని ఆయన కోరారు.. విజయ్ మీడియా సమావేశాన్ని మదురైలోని పోలీసులు పార్టీ శ్రేణుల వద్ద ప్రసారం చేసిచా అక్కడి నుండి కదిలేందుకు ససేమిరా కుదరదంటూ భీష్మించారు. చివరకు చెన్నై నుంచి బయలుదేరి మదురై విమానాశ్రయం చేరుకున్న విజయ్‌కి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎయిర్ పోర్ట్ ప్రవేశద్వారం ముందు ప్రచార వ్యాన్‌పై నుంచి అందరికీ నమస్కరించారు. వెంటనే బారికేడ్లను దాటుకుని పార్టీ కార్యకర్తలంతా విమానాశ్రయం వైపు దూసుకెళ్లారు. విజయ్‌పై పూలు, వాటర్ బాటిల్స్ నుండి నీరు, పాలను చల్లి తమ అభిమానాన్ని వ్యక్తపరచకుకున్నారు. అక్కడి నుండి విజయ్ వ్యాన్‌లో బయలుదేరారు. విమానాశ్రయం నుంచి పెరుంగుడి జంక్షన్ వరకు సుమారు కిలోమీటర్ పొడవునా రహదారికి ఇరువైపులా వేలాదిమంది కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలుకుతూ వెళ్ళారు. విజయ్‌ని చూడగానే ఉత్సాహంతో ఉరకలు వేసిన అభిమానులు, కార్యకర్తలను అదుపుచేయడం పోలీసులకు తలకు మించిన భారంగా పరిణమించింది. అంతే కాకుండా ట్రాఫిక్‌కు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది.



గుజరాత్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన కళాకారులను అభినందిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

కాంగ్రెస్ ఆస్తుల స్వాధీనానికి చర్యలు

- కేవీ తంగబాలు నాయకత్వంలో కమిటీ
- టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఆక్రమణలకు గురైన కాంగ్రెస్ పార్టీ ఆస్తుల స్వాధీనానికి ఆ పార్టీ సీనియర్ కేవీ తంగబాలు నాయకత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటించారు. ఏఐసీసీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి గిరీష్ సోడంకర్ అనుమతితో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కమిటీకి ఉపాధ్యక్షులుగా ఎం. కృష్ణసామి, కేఎస్ అళగిరి, సభ్యులుగా ఎమ్మెల్యే ఎస్.రాజేష్‌కుమార్, డాక్టర్ ఎ.చెల్లకుమార్, ఎంపీ మాణిక్కం ఠాకూర్, కేఆర్ రామసామి, ఎస్ఎస్ రామసుబ్బు, కె.రాణి, న్యాయవాది జి.మాసిలామణి, పి.విశ్వనాథన్, ఎం.క్రిస్టోఫర్ తిలక్, గోపీనాథ్ పాండ్యన్, వీకే అరివళగన్, శాసనసభ్యులు రూబీ ఆర్ మనోహరన్, జేఎంహెచ్ అసన్ మౌలానా, తారగై కదబర్ట్, సీటీ మెయ్యప్పన్, డాక్టర్ నాసే జె.రామచంద్రన్, ఎస్.సుజాత, కె.విజయన్, పెన్నట్ ఆంటోని రాజ్, న్యాయవాదులు ఏబీ సూర్యప్రకాశం, ఓఎమ్మార్ పళనివేల్, ప్యాట్రిక్ రాజ్‌కుమార్, తాంబరం ఎస్.నారాయణన్, టీఎస్ కమలికా కామరాజర్, లెనిన్ ప్రసాద్ ఉంటారు. ఇదే విధంగా సమన్వయ, నిఘా కమిటీలో స్వర్ణా సేతురామన్, న్యాయవాదులు డి.సెల్వం, ఎన్ అరుళ్ పెద్దయ్యా, ఎస్.రామమోహన్ తదితరులు సభ్యులుగా ఉంటారని ఆయన వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ హయాంలో కాంగ్రెస్ పార్టీకి సుమారు రూ.4 వేల కోట్ల విలువైన ఆస్తులు సమకూర్చిపెట్టారని, నగరంలోని సత్యమూర్తి భవన్, తేనాంపేట కాంగ్రెస్ మైదానం తదితర ఆస్తుల విలువ రూ.2వేల కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కంటూ స్థిరాస్తులున్నాయని, అవన్నీ ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు ఆధీనం ఉన్నాయని తెలిపారు. 2016 -2017 సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కమిటీలు పర్యటించి ఏయే జిల్లాల్లో ఎంత వరకు పార్టీకి ఆస్తులున్నాయనే వివరాలను సేకరించాయని వాటి ఆధారంగా ప్రస్తుతం ఈ కొత్త కమిటీ ఆస్తుల స్వాధీనానికి తక్షణ చర్యలు చేపడుతుందని సెల్వపెరుంతగై తెలిపారు. ఈ కమిటీ మూడు నెలల్లోగా నివేదికను సమర్పించనున్నదని తెలిపారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్, పెరంబూర్, ఆవడి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఎగ్మూర్ పరిధిలో వెప్పేరి సంపత్ రోడ్డు సమీపంలోని విద్యుత్ ఉప కేంద్రం, పెరంబూర్ పరిధిలో సింప్సన్ ఎంఈఎస్ రోడ్డు సమీపంలోని సెంబియం ఉప విద్యుత్ కేంద్రం, ఆవడి పరిధిలో ఎస్ఎం నగర్ మురుగప్ప పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో జరుగనున్న ఈ గ్రీవెన్స్‌లో ఆయా ప్రాంతాల ప్రజలు పాల్గొని, విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు ఐదు మండలాల్లో తాగునీటి సరఫరా నిలిపివేత

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ మండలం కెల్లీస్ ప్రాంతంలో ప్రధాన తాగునీటి పైప్ లైన్ అనుసంధాన పనుల కారణంగా చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ఐదు మండలాల్లో 36 గంటలు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, మండలం-4 (తండయార్‌పేట) పరిధిలోని తండయార్‌పేట, మండలం-5 (రాయపురం) పరిధిలో పురుషవాక్కం, పెరియమేడు, షావుకారుపేట, ఎగ్మూర్, చింతాద్రిపేట, మండలం-6 (తిరువిక నగర్) పరిధిలో ఒట్టేరి, అయనావరం, పెరంబూర్, సెంబియం, మండలం-8 (అన్నానగర్) పరిధిలో కీల్పాక్కం, విల్లివాక్కం, కెల్లీస్, మండలం-9 (తేనాంపేట) పరిధిలో ట్రిప్లికేన్ ప్రాంతాలకు శనివారం ఉదయం 8 నుంచి 4వ తేది రాత్రి 8 గంటలు (36 గంటలు) తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ప్రజలు ముందుగానే తాగునీరు భద్రపరచుకోవాలని, అత్యవసర సేవలకు https://cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు. కనెక్షన్లు లేని ప్రాంతాలకు టాంకర్ లారీల ద్వారా నీరు సరఫరా చేయనున్నట్లు వాటర్ బోర్డు తెలిపింది.

12 నుంచి 'కంప్యూటర్ 'సి' ప్రోగ్రామింగ్'పై వర్క్‌షాప్

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల క్రోంపేటలో ఉన్న ఎంఐటీ ప్రాంగణంలోని డాక్టర్ కలాం కంప్యూటర్ సెంటర్‌లో 'కంప్యూటర్ 'సి' ప్రోగ్రామింగ్‌'పై వర్క్‌షాప్ అందించనున్నారు. ఈ నెల 12 నుంచి 17వ తేది వరకు నిర్వహించనున్న ఈ వర్క్ షాప్‌లో టెన్త్, ప్లస్ టూ విద్యార్థులు పాల్గొనవచ్చు. వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు రూ.1,500 ఫీజు నిర్ణయించగా, 50 మందిని మాత్రమే అనుమతించనున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 9వ తేదిలోపు పేర్లు నమోదుచేసుకోవాలి. వివరాలకు https://www.annauniv.edu/pdf/C_Workshop_Brochure25.pdf అనే వెబ్‌సైట్‌లో 044-22516012/6317 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఒకేరోజు రూ.272.87 కోట్ల ఆదాయం

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఒకేరోజు రూ.272.87 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ శాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో...ఏప్రిల్ 30, బుధవారం అధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని భావించి, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు పంపిణీ చేసామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 10వ తేది ఒకేరోజు రూ.237.98 కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. తాజాగా బుధవారం 27.440 పత్రాల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.272.87 కోట్ల ఆదాయం లభించిందని రిజిస్ట్రేషన్ శాఖ తెలియజేసింది.

ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే పాఠశాలల ప్రారంభం వాయిదా

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎండలు అధికంగా ఉంటే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేసే అవకాశముందని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. తిరుచ్చిలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించామని, జూన్ 2 నుంచి పాఠశాలలు పునఃప్రారంభిస్తామని తెలియజేశామన్నారు. కానీ, జూన్ మొదటి వారంలో ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో, ముఖ్యమంత్రి కార్యాలయం సలహా మేరకు పాఠశాలల పునఃప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలుచేసే ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు.

రూ.15.50తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాణి జ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.15.50 తగ్గి రూ.1,906కి విక్రయమవుతోంది. ప్రజా శాఖకు చెందిన చమురు సంస్థలు గృహాలకు 14.20 కిలోల బరువు, వాణిజ్య వినియోగానికి 19 కిలోల గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంటాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుకూలంగా, దేశంలో ప్రతినెలా మొదటి రోజున, గ్యాస్ సిలిండర్ ధరలు మార్పు చేస్తుంటారు. ఆ క్రమంలో, మే నెలకు సంబంధించి వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.15.50 తగ్గగా, గృహ వినియోగ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పులు లేకుండా రూ.818.50కి విక్రయమవుతోంది.

బెంగళూరులో స్థలాభావంతో చెన్నైలో 5 విమానాల ల్యాండింగ్

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు విమానాశ్రయంలో బుధవారం రాత్రి విమానాల రాకపోకలు పెరగడంతో ఐదు విమానాలు అక్కడ దిగలేకపోయాయి. దీంతో ఆ ఎయిర్‌పోర్ట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ విమానాలను చెన్నైకి మళ్ళించారు. ఆ విమానాలు అర్ధరాత్రి చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యాయి. 135 మంది ప్రయాణికులతో వచ్చిన హైదరాబాద్ - బెంగళూరు విమానం, 294 మంది ప్రయాణికులతో హాంకాంగ్ నుండి వచ్చిన విమానం, 127 మందితో నాగపూర్ నుండి వచ్చిన విమానం, 154 మందితో గోవానుండి వచ్చిన విమానాం, 327 మందితో ఫ్రాంక్‌ఫర్ట్ నుండి వచ్చిన విమానాన్ని చెన్నై మళ్ళించారు. ఈ ఐదు విమానాలు మీనాంబాక్కం ఎయర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ అయినప్పటికి, వాటిలో ప్రయాణికులను కిందకు దించలేదు. విమానాశ్రయ సిబ్బంది ప్రయాణికులకు అల్పాహారం ప్యాకెట్లను అందజేసారు. బెంగళూరు విమానాశ్రయంలో ట్రాఫిక్ తగ్గినట్లు సమాచారం అందగానే వేకువజాము 3.35 గంటలకు ఈ విమానాలు ఒకదాని వెంట ఒకటి బెంగళూరు వెళ్లాయి.

కోలాహలంగా మారియమ్మన్ ఆలయ వేడుకలు




వల్లి గుమ్మిఆట్టంలో భక్తులు

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మారియమ్మన్ ఆలయ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వల్లి గుమ్మిఆట్టం కోలాహలంగా సాగింది. తిరుప్పూర్ జిల్లా మడత్తుకుళం సమీపం కొళుమమ్ గ్రామంలో కోట మారియమ్మన్ ఆలయం ప్రసిద్ధిచెందింది. ఈ ఆలయ చిత్తిరై వేడుకలు మూడు రోజులుగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వందలాది మంది పిల్లలు, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని సుమారు గంటసేపు వల్లి గుమ్మిఆట్టం చేస్తూ కనువిందు చేశారు. ఈ ప్రదర్శనను పొల్లాచ్చి ఎంపీ ఈశ్వరస్వామి ప్రారంభించగా, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రానికి రూ.2,999 కోట్ల ఉపాధి నిధులు విడుదల

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలులో ఉన్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.2,999 కోట్లు విడుదల చేసింది. 2005లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ పథకంలో రాష్ట్రానికి రావాల్సిన రూ.4,034 కోట్లు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలంగా నిలిపివేసింది. నిధుల నిలిపివేతపై పలు పార్టీలు ఆందోళనలు చేపట్టగా, పార్లమెంటులో డీఎంకే ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంతో పాటు నిరసనలు చేశారు.. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో రాష్ట్రానికి రూ.2,999 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే, 2024-25 సంవత్సర బకాయి రూ.1,246 కోట్లు కూడా కేంద్రం త్వరలో అందజేస్తుందనే నమ్మకం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ప్రైవేటు పాఠశాలల బస్సుల తనిఖీ



బస్సులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌రాజ్

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను జిల్లా కలెక్టర్ అరుణ్ రాజ్ తనిఖీ చేశారు. ప్రైవేటు బస్సుల్లో ఏర్పాటుచేసిన వసతులు, భద్రతా చర్యలను ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు జిల్లా కలెకర్, విద్యాశాఖ, పోలీసు, రెవెన్యూ సహా పలు శాఖల అధికారులు పరిశీలిస్తుంటారు. చెంగల్పట్టు జిల్లాల్లో 114 ప్రైవేటు పాఠశాలలకు 607 బస్సులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, చెంగల్పట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ప్రైవేటు బస్సుల తనిఖీలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 307 బస్సులు రాగా, కలెక్టర్ అరుణ్‌రాజ్ బస్సుల్లో భద్రతా పరమైన సదుపాయాలు పరిశీలించారు. వాటిలో 14 బస్సుల్లో లోపాలు గుర్తించిన కలెక్టర్, 10 రోజుల్లో వాటిని సరిచేసి మళ్లీ తీసుకురావాలని ఆదేశించారు.

ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి సంతాపం



వేలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని కాట్పాడి బస్టాండులో గురువారం ఉదయం సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్ర దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శివకుమార్, ఆర్గనైజర్ జంబు లింగం తదితరులు మృతుల ఫోటోలకు పుష్పాంజలి ఘటించారు.

చెరకు కొనుగోలు ధర పెంచాలి

● పీఎంకే నేత రాందాస్

ప్యారీస్, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతుల నుండి కొనుగోలు చేసే చెరకు ధర టన్నుకు రూ.5వేలు ఎంచాలని పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆయన గురువారం విడుదల చేసిన ప్రకటనలో, చెరకు కొనుగోలు ధర పెంచడంపై కేంద్రప్రభుత్వంతో రాష్ట్రప్రభుత్వం చర్చించి రైతులకు లబ్దిచేకూర్చాలని కోరారు.

నెమ్మేలి తీరప్రాంతానికి కొట్టుకొచ్చిన భారీ పైపులు



నెమ్మేలి తీరప్రాంతానికి కొట్టుకొచ్చిన పైపులు

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సముద్రం వాతావరణం అల్లకల్లోలంగా ఉండడంతో భారీ పైపులు తీరప్రాంతానికి కొట్టుకురావడంపై జాలర్లు విస్మయం వ్యక్తం చేశారు. చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపం నెమ్మేలి తీర ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వ తాగునీటి బోర్డు ఆధ్వర్యంలో 400 ఎమ్మెల్డీ సామర్థ్యంతో కొత్త తాగునీటి ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం నెమ్మేలి సముద్ర తీరం వెంబడి 1,500 మీటర్ల మేర భారీ పైపులు ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం సముద్రపు అలల ఉధృతి అధికంగా ఉండడంతో పైపులు తీరానికి కొట్టుకొచ్చాయి. సమాచారం అందుకున్న వాటర్ బోర్డు ఇంజనీర్లు అక్కడకు చేరుకుని పైపులు తొలగించే పనులు చేపట్టారు. కానీ, అలల ఉధృతి కారణంగా పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఈ క్రమంలో, సముద్ర తీరం నుంచి సుమారు 1.5 కి.మీ మేర భారీ పైపులు కొట్టుకురావడంతో, నెమ్మేలి ప్రాంతానికి చెందిన జాలర్లు గురువారం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లేందుకు వీలుకాకపోవడంతో తీరానికే పరిమితమయ్యారు.

ఆన్‌లైన్ కోర్టు విచారణకు ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ గది



వీడియో కాన్ఫరెన్స్ గది ప్రారంభిస్తున్న ఏసీపీ విజయేంద్ర బిధారి

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో కోర్టు విచారణలకు దర్యాప్తు అధికారులు, అధికారులు పాల్గొనేలా ఎగ్మూర్‌లో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ గది ఏర్పాటైంది. ఈ విషయమై గ్రేటర్ చెన్నై పోలీసు విభాగం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వులతో ఎగ్మూర్‌లోని తూర్పు జోన్ జాయింట్ కమిషనర్ పోలీసు కార్యాలయంలో కోర్టుల ఆన్‌లైన్ విచారణ కోసం ఆధునిక సౌకర్యాలతో కూడిన వీడియో కాన్ఫరెన్స్ గది సిద్ధం చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో నగర పోలీసు అదనపు కమిషనర్ విజయేంద్ర బిధారి ఈ గదిని ప్రారంభించారు. ఆడియో-వీడియో రికార్డింగ్ సేకరణ, భద్ర పరచడం, సాక్ష్యాలు, పత్రాలు సకాలంలో సమర్పించే సదుపాయం, సాక్షుల వ్యక్తిగత గోప్యత కాపాడు కోవడం తదితర వసతులతో ఈ వీడియో కాన్ఫరెన్స్ గది ప్రారంభించినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

సినీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ

'దక్షిణ భారత' సమ్మేళనంలో నిర్ణయం



సినీ కార్మికుల సమ్మేళంలో హీరో విశాల్, రోజా తదితరులు

పుత్తూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): సినీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పథకాలను వర్తింపచేయాలని దక్షిణ భారత సినీ కార్మికుల సమ్మేళనంలో నిర్ణయించారు మే డే సందర్భంగా చెన్నైలో దక్షిణ భారత సినీ కార్మికుల సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. తన ఎదుగుదలకు కారణమైన సినీ రంగానికి జీవితాంతం రుణపడి ఉంటానన్న ఏపీ మాజీ మంత్రి రోజా కార్మిక సంఘానికి రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఎఫ్ఎస్ఐ అధ్యక్షుడు సెల్వమణి, హీరో విశాల్ తదితరులు పాల్గొన్నారు.

శంకరన్ కోవిల్‌లో రైతు దారుణహత్య

అడయార్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ సమీపంలో ఓ రైతు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసేందుకు రెండు ప్రత్యేక బృందాలను పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాటుచేశారు. మరోవైపు, హత్యకు పాల్పడిన వారిని అరెస్టుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తూ, మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించారు. తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్‌కు చెందిన పెరియస్వామిపురం గ్రామానికి చెందిన అబ్రహాం(42) అనే రైతు.బుధవారం రాత్రి తనఇంటి ముందు నిలబడి వుండగా, ఆ సమయంలో గుర్తు తెలియని ముఠా మారణాయుధాలతో దాడి చేసి పారిపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రైతును తిరునెల్వేలి ప్రభుత్వ వైద్య కాలేజీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన బంధువులు మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు.

నేడు, రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

శుక్రవారం

పొత్తుపెరుంబేడు: కుమరన్ నగర్, సెంగనలమ్మాన్ నగర్, విజయనల్లూర్, సిరునియం, పార్థసారథి నగర్, విజయా గార్డెన్. **ఎన్నూర్:** కత్తివాక్కం, ఎన్నూర్ బజార్, కాట్టుకుప్పం, నెహ్రూ నగర్, శాస్త్రి నగర్, అన్నా నగర్, శివన్‌పడై వీధి, వళ్లువర్ నగర్, కామరాజర్ నగర్, ఎస్వీఎం నగర్, ఉళగందాపురం, ముగత్తువరాకుప్పం, ఎన్నూర్‌కుప్పం, తాళంకుప్పం, నేట్టుకుప్పం, చిన్నకుప్పం, పెరియకుప్పం, ఎర్నావూర్ కుప్పం, ఈటీపీఎస్ హౌసింగ్ బోర్డు, ఎర్నావూర్, జ్యోతి నగర్, రామనాథపురం, శక్తిగణపతి నగర్, షణ్ముగపురం

శనివారం


కోయంబేడు మార్కెట్: రెడ్డి వీధి, కరుణాకర్ వీధి, పల్లవన్ నగర్, జయలక్ష్మి నగర్, మూకాంబిగై నగర్, రాజీవ్‌గాంధీ నగర్, సీటీఎన్ నగర్, అళగమ్మాళ్ నగర్. **ఎగ్మూర్:** రామానుజం వీధి, వినాయక ముదలి వీధి, తంబినాయకన్ వీధి, మునియప్ప వీధి, కోత్వాల్ చావిడి, ఎర్రబాలు వీధి, మన్నడి, వాల్‌టాక్స్ రోడ్డు, వుడ్‌వర్ఫ్ వీధి, టెలిగ్రాఫ్ అప్పాయిన్ వీధి, అన్నాపిళ్లై వీధి, పల్లియప్పన్ వీధి, ముల్లాసాహిబ్ వీధి, పెరుమాళ్ మొదటి వీధి, మింట్ వీధి, తులసింగం వీధి, పెరియనాయకన్ వీధి, చిన్ననాయకన్ వీధి, ఎన్ఎస్‌సీ బోస్ రోడ్డు, జనరల్ ముత్తయ్య వీధి, టీవీ బేసిన్ వీధి, పీకేజీ ఏరియా, తాండవరాయన్ వీధి, అరుణాచలం వీధి, తిరుపల్లి వీధి, కేఎన్ అగ్రహారం, లాయర్ చిన్నతంబి వీధి, కేఎన్ రోడ్డు, పెద్ద నాయకన్ వీధి, అయన్‌మంగ వీధి, వీరప్పన్ వీధి, కళ్యాణపురం హౌసింగ్ బోర్డు, జట్కాపురం, ఎలకందప్ప వీధి, కందప్ప వీధి, మురుగప్ప వీధి, ఎట్టపాళయం, పొన్నప్పన్ వీధి, వెంకట్రాయన్ వీధి, రమనన్ వీధి, ఆదియప్ప వీధి, వైకుంఠ వైద్దియార్ వీధి, కలాత్తిపిళ్లై వీధి, ఇరుళప్పన్ వీధి, ఎలిఫెంట్ గేట్ వీధి, చంద్రప్ప వీధి, అయ్య మొదటి వీధి, గోవిందప్ప వీధి, కుడవున్ వీధి, బేసిన్ వాటర్ వర్క్స్ వీధి, ఎంఎస్ నగర్ అపార్ట్‌మెంట్స్, ఉడ్‌వార్ఫ్ లైన్, కన్నయ్యానాయుడు వీధి, పెరుమాళ్ ముదలి వీధి, కొండితోపు పోలీసు క్వార్టర్స్, పడవేట్టమ్మన్ వీధి, టీపీ నాయుడు వీధి, తెరు లైన్, పెదునాయకన్ వీధి, నార్త్‌వాల్ రోడ్డు.

తిరుప్పూరులో నర్సు దారుణహత్య

● పరారైన భర్త



సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు



మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ సిబ్బంది

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు నగరం పల్లడం రోడ్డులో కలెక్టర్ కార్యాలయం సమీపం పూంపుహార్ నగరంలో ఓ పాడుపడిన ఇంటి స్థలంలో ప్రైవేటు ఆస్పత్రి నర్సు దారుణహత్యకు గురైంది. గురువారం ఉదయం తల పూర్తి ధ్వంసమై ఓ యువతి శవం పడి ఉండడం స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ జాన్, సీఐలు గణేశ్‌కుమార్, సరస్వతి సిబ్బందితో హుటాహుటిన అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. ఆ యువతి గులాబీరంగు నర్సు యూనిఫామ్ ధరించి ఉండటంతో పోలీసుల విచారణ చేపట్టగా ఆ మృతదేహం మదురైకి చెందిన చిత్తిరై (28) అని, తిరుప్పూరు పల్లడం రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోందని తెలుసుకున్నారు. ఇరవై రోజుల క్రితమే ఆమె నర్సుగా డ్యూటీకి చేరిందని, పెళ్లయి ఆమెకు ఓ బిడ్డ కూడా ఉందని, భర్త రాజేష్‌ఖన్నాతో గొడవపడి తిరుప్పూరు వచ్చి ఒంటరిగా అద్దె ఇంటల్లో ఉంటున్నట్టు తేలింది. తనతో కాపురానికి రమ్మని ఆమె భర్త బలవంతపెట్టాడని, ఆ నేపథ్యంలో బుధవారం రాత్రి ఆమెను వెంబడించింది పాడుపబడిన ఇంటి వద్ద దారుణంగా హత్య చేశాడని తెలుసుకున్నారు ఈ విషయాన్ని అక్కడి సీసీ కెమెరాలో నమోదైన వీడియో దృశ్యాలు కూడా నిర్ధారించాయి. ఇదిలా ఉండగా నర్సు చిత్రను హతమార్చిన ఆమె భర్త రాజేష్‌ఖన్నా పరారీలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు అతడి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు.

7న అన్నాడీఎంకే ధర్నా

అడయార్, మే 1 (ఆంధ్రజ్యోతి): షోళింగనల్లూరు నియోజకవర్గంలోని ప్రజలకు కనీస సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 7వ తేదీ ధర్నా చేయనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ప్రకటించారు. ఈ విషయంపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సౌకర్యాలతో పాటు వైద్యులు, నర్సులు, ఇతర సహాయక సిబ్బందిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

పేద పిల్లలకు నూతన వస్త్రాల పంపిణీ



వేలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు రంగాపురంలోని మూల కొల్లైలో పేద కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో గురువారం ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్ పేద పిల్లలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దినేష్ మాట్లాడుతూ, గత 4ఏళ్ళుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులోసుమారు 60 మంది పిల్లలకు నూతన వస్త్రాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు.

కాలుష్యంపై అవగాహన కార్యక్రమం



వేలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని ఎఫ్‌సీఐ గిడ్డంగి వీధిలో గురువారం ఉదయం న్యాయవాదుల సంఘం, జాతీయ రహదారుల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కాలుష్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మురుగన్ మాట్లాడుతూ, కాలుష్యాన్ని తగ్గించడానికి చెట్లు ఎంతో ఉపయోగపడతాయని, చెట్ల పెంపకం ద్వారా ప్రగతికి ఎంతో మేలు చేకూర్చిన వారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు, రహదరి శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



వేలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి పరిధిలో కాంగేయ నల్లూరులో నూతనంగా నిర్మించిన రాఘవేంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 10వ వార్డు కౌన్సిలర్ రమేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

వేలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని ఊరీసు కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఆనికమల్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. అనంతరం రోడ్డుభద్రతపై జేఆర్‌సీ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసి, ప్రతీఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు.

పిన్నమ్మ కుమార్తె హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): పిన్నమ్మ కుమార్తెను హతమార్చిన కేసులో నిందితుడికి కోర్టు ఉరిశిక్ష విధించింది. పుదుకోట జిల్లా తిరుమయం పెరుందురై ప్రాంతానికి చెందిన సురేష్ (32) పిన్నమ్మ కుమార్తె లోకప్రియ (21) ఓ యువకుడిని వివాహం చేసుకుని పుదుకోట పొన్‌నగర్‌లో తన తల్లి ఇంట్లో ఉండేది. లోకప్రియను తరచూ కలిసే సురేష్, డబ్బుల కోసం వేధిస్తుండేవాడు. 2021 ఏప్రిల్ 27వ తేది మళ్లీ ఇంటికి వచ్చిన సురేష్ డబ్బులు ఇవ్వాలంటూ లోకప్రియను వేధించాడు. డబ్బు ఇచ్చేందుకు లోకప్రియ నిరాకరించడంతో సురేష్ కోపంగా కత్తితో ఆమెపై దాడిచేసి మెడలోని బంగారు చైన్ లాక్కొని పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన లోకప్రియ ఘటనా స్థలంలోనే మృతిచెందింది. గణేష్‌నగర్ పోలీసులు కేసు నమోదుచేసి సురేష్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు పుదుకోట జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నిందితుడు సురేష్‌కు ఉరిశిక్ష విధిస్తూ న్యాయమూర్తి చంద్రన్ బుధవారం తీర్పు వెలువరించారు.

ఆలయాల్లో 'రీల్స్' చేస్తే కఠిన చర్యలు

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో 'రీల్స్' వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేఉసే వారిపై కఠిన చర్యలు చేపడతామని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు హెచ్చరించారు. విల్లివాక్కంలో బుధవారం రాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ... తిరునల్వేలి నెల్లయప్పర్ ఆలయంలో సినిమా పాటకు నాట్యం చేస్తూ 'రీల్స్' వీడియో తీశారన్నారు. వీడియో తీసిన వారిపై ఫిర్యాదు చేసి, చట్టప్రకారం చర్యలు చేపతామని తెలిపారు. ఆధ్యాత్మిక ప్రదేశాల్లో భక్తుల మనోభావాలకు భిన్నంగా వీడియో రీళ్లను విడుదల చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు.

విమానంలో వచ్చిన లగేజీ అదృశ్యం

● 'ఇండిగో' సంస్థపై డీఎంకే ఎంపీ ఫిర్యాదు

పెరంబూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీ నుంచి విమానంలో చెన్నై వచ్చిన తాను వేచి ఉన్నా, దుస్తులు అందలేదని, ఈ విషయంలో ఇండిగో ఎయిర్‌లైన్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని' డీఎంకే ఎంపీ విల్సన్ ఆరోపించారు. ఈ మేరకు ఎంపీ తన ఎక్స్ పేజీలో... ఢిల్లీ విమానాశ్రయం నుంచి మంగళవారం గంట ఆలస్యంగా బయల్దేరి చెన్నై చేరుకున్న విమానం నుంచి దిగిన తాను లగేజీ కోసం గంట సేపు వేచి ఉన్నా కానీ లగేజీ రాకపోవడంతో, మొబైల్ యాప్ ద్వారా పరిశీలించగా లగేజీ ఢిల్లీ విమానాశ్రయంలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై ఢిల్లీలోని ఇండిగో సంస్థ సిబ్బందిని సంప్రదించినా, వారి నుంచి సరైన సమాధానం రాలేదు. సుమారు రెండు గంటలు విమానాశ్రయంలో ఉన్నా, నా లగేజీ అందలేదు. లగేజీలో మందులు, ఇంటి తాళం సహా పలు అత్యవసర వస్తువులున్నాయి. ఇలాంటి ఘటనల్లో కేంద్ర పౌర విమాన మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి ఘటనలు ప్రయాణికులను నిర్లక్ష్యంగా చూడడమే'నని ఎంపీ పోస్ట్ చేశారు. కాగా, ఈ విషయమై స్పందించిన ఇండిగో సంస్థ, మీకు జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, మిమ్మల్ని సంప్రదించేందుకు మాకు సమయం కేటాయించాలని ఎంపీని కోరడం గమనార్హం.

ఐపీఎల్ బెట్టింగ్ చేస్తున్న ముగ్గురి అరెస్టు

● రూ.19లక్షల స్వాధీనం

అడయార్, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడే ముగ్గురుని పోలీసులు అరెస్టు చేసి, రూ.19 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఐపీఎల్ పోటీల్లో భాగంగా బుధవారం రాత్రి చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య కీలక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ విజయావకాశాలపై భారీగా బెట్టింగ్ జరిగినట్టు తెలిపారు. కొందరు రహస్యంగా బెట్టింగులకు పాల్పడినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. ముఖ్యంగా ఆన్‌లైన్ యాప్ "లోటస్" ద్వారా ఈ బెట్టింగులకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందం ఆకాష్ కుమార్, సురేష్, ఆకాష్ జైన్ అనే ముగ్గురు జూదగాళ్ళను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు కలిసి గత నెల రోజులుగా బెట్టింగులకు పాల్పడుతున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది.





విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు పడమటి కనుమల దిగువన వద్దిరాయిరుప్పు గ్రామ సమీపంలో ఉంది అర్జునాపురం. దక్షిణాది జిల్లాల ప్రజలంతా కుటుంబ బాంధవ్యాలు మెరుగుపడేందుకు ఆరాధించే అనుగ్రహ దేవత 'నల్లతంగాళ్' జీవించిన అరుదైన క్షేత్రంగా ఆ ఊరిలోని పచ్చటి పంటపొలాల నడుమ ఉంది నల్లతంగాళ్ ఆలయం. కోయంబత్తూరు, కడలూరు, తిరుప్పూరు జిల్లాల ప్రజలంతా నల్లతంగాళ్‌ను తమ కులదేవతగా ఆరాధిస్తున్నారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి నిలువెత్తు సాక్ష్యంగా దర్శనమిస్తుంది నల్లతంగాళ్ ఆలయం. ఆంధ్రరాష్ట్రంలో 'కన్యకాపరమేశ్వరి', 'కావమ్మ' పూజలందుకున్నట్టే ఈ 'నల్లతంగాళ్' తమిళ భక్తుల ఆరాధ్యదేవతగా అలరారుతోంది.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

అన్నాచెల్లెళ్ల ఆత్మీయతను చాటే

నల్లతంగాళ్ ఆలయం

● సకల సంపదలిచ్చే అనురాగదేవత


సప్తకన్యలు

అనుగ్రహ దేవత...

ఈ ఆలయంలోని నల్లతంగాళ్ భక్తులు కోరిన కోరికలను నెరవేర్చే అనుగ్రహదేవతగా పేరుపొందింది. ఆ అమ్మవారిని దర్శించుకుంటే బాంధవ్యాలు మెరుగుపడతాయని, అన్నదమ్ముల మధ్య కలహాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కటికదారిద్ర్యంతో బాధపడుతున్నవారు, ఈ ఆలయంలో అమ్మవారి ఎదుట ఎనిమిది దీపాలను వెలిగిస్తే సకల సంపదలు కలుగుతాయని చెబుతారు. యువతులు ఈ ఆలయంలో ఇచ్చే పసుపు దారాన్ని చేతికి కట్టుకుంటే త్వరలోనే వివాహం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొంటున్నారు.


నల్లతంగాళ్ ఆలయ ప్రవేశద్వారం

స్థలపురాణం...

ఐదు శతాబ్దాలకు పూర్వం అర్జునాపురం, దాని పరిసర గ్రామాలను రామలింగ్ సేతుపతి, ఇంద్రాణి దంపతులు పరిపాలిస్తుండేవారు. ఈ దంపతులకు నల్లతంబి, నల్ల తంగాళ్ అని ఇద్దరు పిల్లలు. వీరిద్దరు యుక్తవయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. నల్లతంబి రాజ్యాధికారం చేపట్టాడు. తల్లిదండ్రులేని తన సోదరి నల్లతంగాళ్‌ను అల్లారుముద్దుగా పెంచి, పెద్దచేసి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం శివగంగ జిల్లాలో ఉన్న మానామదురై ప్రాంతాన్ని పరిపాలిస్తున్న కాశిరాజా అనే రాజుకు తన సోదరి నల్లతంగాళ్‌ను ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. భారీ స్థాయిలో కట్నకానుకలను కూడా అందించారు. ఆ దంపతుల అన్యోన్య దాంపత్యానికి చిహ్నంగా వారికి నలుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. కొంతకాలానికి నల్లతంగాళ్‌ను కాశిరాజు విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఆ పరిస్థితుల్లో మానామదురైలో కరవు తాండవించింది. 12 యేళ్ల వర్షాలు లేవు. పంట భూములు ఎడారిగా మారాయి. ప్రజలు కరవుకోరల్లో చిక్కుకున్ని ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. నల్లతంగాళ్ కుటుంబం కూడా దైన్యస్థితికి చేరింది. అన్నాగారు కట్నంగా ఇచ్చిన నగలమ్ముకుని తన ఏడుగురు పిల్లలకు ఆకలి తీరుస్తూ వచ్చింది. చివరకు అందరూ కట్టుబట్టలతో మిగిలారు. మానామదురైలో ఇక ఏమాత్రం ప్రాణాలతో ఉండలేమని గ్రహించిన నల్లతంగాళ్ తన అన్నగారి సాయం అడిగేందుకు అర్జునాపురానికి వెళ్ళింది. ఆ సమయంలో ఆమె సోదరుడు నల్లతంబి వేట కోసం అడవికి వెళ్ళాడు. వేట ముగించుకుని నల్లతంబి తిరిగొచ్చేదాకా ఉందామని ఏడుగురు పిల్లలతో అన్నాగారింట్లో అడుగుపెట్టిన నల్లతంగాళ్‌కు ఆమె వదిన నుంచి అనుమానాలే ఎదురయ్యాయి. చింపిరి గుడ్డలు ధరించి వచ్చిన ఆడపడచు నల్లతంగాళ్, ఆమె పిల్లలను చూసి ఏవగించుకుంది. కనీసం పలకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నాలుగైదు రోజులు నల్లతంగాళ్, ఆమె ఏడుగురు పిల్లలు పస్తులతోనే గడపాల్సి వచ్చింది. వేటకు వెళ్ళి నల్లతంబి ఎప్పుడు తిరిగి వస్తాడో తెలియకపోవటంతో నల్లతంగాళ్, ఆమె పిల్లలను ఆమె వదిన నిర్దాక్షిణ్యంగా తరిమికొట్టింది. నల్లతంగాళ్ విలపిస్తూ ఏడుగురు పిల్లలను వెంటబెట్టుకుని అక్కడి నుండి బయలుదేరుతూ ఇక బ్రతకటం కష్టమనిపించింది. పిల్లలు 'అమ్మా.. ఆకలి... ఆకలి...' అంటూ కేకలు పెట్టారు. కన్నపిల్లలకు పట్టెడన్నం కూడా పెట్టలేని తన పరిస్థితిని తలచుకుని బాధపడింది. మార్గమధ్యంలో ఓ పాడుబడిన బావి కనిపించింది. ఆకలితో బాధపడుతున్న ఏడుగురు పిల్లల్ని ఆ బావిలోకి తోసి తనూ ఆ బావిలోనే పడి ఆత్మహత్య చేసుకుంది. వేట నుండి తిరిగొచ్చిన నల్లతంబికి అన్ని విషయాలు తెలిశాయి. తన చెల్లెలు, ఏడుగురు పిల్లలతో బావిలోపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకుని విలవిలలాడిపోయాడు. తన చెల్లెలి కుటుంబం ఆత్మహత్యకు కారణమైన భార్యను హతమార్చాడు. ఆ తర్వాత చెల్లెల్ని తలచుకుంటూ నల్లతంబి దిగులుతో బాధపడుతూ కొంత కాలం తర్వాత మృతి చెందాడు. కైలాసం నుంచి అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని తిలకించిన పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమయ్యారు. ఆదిదంపతుల అనుగ్రహంతో బావిలోపడిన నల్లతంగాళ్, ఆమె పిల్లలు ప్రాణాలతో తిరిగొచ్చారు. నల్లతంబి కూడా నిద్రనుండి మేల్కొన్నట్లు వచ్చాడు. పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్న వారిద్దరూ తమకు మోక్షం ప్రసాదించమని వేడుకున్నారు. పార్వతీపరమేశ్వరులు వారికి మోక్షాన్ని ప్రసాదించారు. నల్లతంబి, నల్లతంగాళ్, ఆమె పిల్లలు జ్యోతిస్వరూపులై పరమేశ్వరుడిలో ఐక్యమొందారు. ఆ నాటి నుండి నల్లతంగాళ్, నల్లతంబి దేవతా స్వరూపులై భక్తులను అనుగ్రహిస్తూ వస్తున్నారు.

ఆధ్యాత్మికం

సుమారు ఐదు వందల సంవత్సరాల క్రితం జరిగిన ఈ నల్లతంగాళ్ జీవిత గాథను దశాబ్దాలుగా దక్షిణాది జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో నాటకాలుగా, వీధి భాగవతంగా ప్రదర్శించేవారు. ఇప్పటికీ దక్షిణాది జిల్లాల్లో ఏ మారుమూల గ్రామంలోనో ఈ నల్లతంగాళ్ కథ నాటకంగా, వీధిభాగవతంగా ప్రదర్శిస్తూనే ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత ఈ కథతోనే 'నల్లతంగాళ్' అనే సినిమా కూడా విడుదలై నిర్మాతలకు కనక వర్షం కురిపించింది. చెన్నైలో రెండు శతాబ్దాలకు ముందే నల్లతంగాళ్ కథను పిల్లల నుండి వృద్ధులదాకా సులువుగా తెలుసుకునేలా పూర్తి బొమ్మలతో ముద్రించిన పుస్తకాలు వేల సంఖ్యలో అమ్ముడై, ఎన్నోసార్లు పునర్ముద్రణ కూడా జరిగింది. 'నల్లతంగాళ్' కథతో కూడిన బొమ్మల పుస్తకాలు, సంపూర్ణ కథతో ఉన్న పుస్తకాలు కోయంబత్తూరు, కడలూరు, తిరుప్పూరు జిల్లాల్లో విపరీతంగా అమ్ముడవుతూనే ఉన్నాయి. ఈ పుస్తకాలన్నీ ఒకే కథతో కూడుకున్నవే అయినా ఆనాటి నుండి ఈనాటి వరకు రచయితలు మారుతున్నారు. వర్ణనలో వైవిధ్యం చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఈ కారణంగా నల్లతంగాళ్ పుస్తకాలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. అంతే కాకుండా రామాయణం, భాగవతం, భగవద్గీత వంటి గ్రంథాలను దాచుకున్నట్లు 'నల్లతంగాళ్' పుస్తకాలను ఆ మూడు జిల్లాల ప్రజలు తమ పూజగదుల్లో భద్రపరచుకుంటున్నారు. తమ కుటుంబంలో కష్టాలు ఎదురైతే ఆ కథను నియమనిష్ఠలతో పఠించేవారు కూడా ఆ మూడు జిల్లాల్లో అధికంగా ఉన్నారనటం అతిశయోక్తికాదు.

ఆలయ వైభవం...

నల్లతంగాళ్ ఆలయం తక్కిన ఆలయాలకంటే వైవిధ్యంగా ఉంటుంది. పచ్చటి పొలాల నడుమ ఎత్తయిన చెట్ల మధ్య ఉన్న ఈ ఆలయం అత్యంత ప్రాచీనమైనదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఆలయం చిన్నదే అయినా దీని కీర్తి మాత్రం పెద్దదే. గర్భాలయంలో నల్లతంగాళ్ విగ్రహం గాంభీర్యంగా దర్శనమిస్తుంది. నల్లతంగాళ్ ఏడుగురుపిల్లలు ఏకశిలపై చెక్కిన విగ్రహం మరొక సన్నిధిలో ప్రతిష్ఠించి ఉంది. ఈ ఆలయానికి కాస్త దూరంలో ఓ పాడబడిన బావి ఉంది. ఆ బావిలోనే నల్లతంగాళ్, ఆమె పిల్లలు ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతారు. వర్షాకాలంలోనే జలకళ సంతరించుకునే అర్జునానది తీరంలో ఉందీ ఈ నల్లతంగాళ్ బావి.


ఏడు దశాబ్దాలకు ముందు ప్రచురించిన నల్లతంగాళ్ బొమ్మల పుస్తకం

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో ప్రతియేటా ఆణి నెలలో పొంగల్ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఇదే విధంగా ఆడి నెలలో జరిగే పొంగల్ వేడుకలలో మానామదురై నుండి నల్లతంగాళ్ వంశంలో జన్మించినవారంతా కుటుంబ సమేతంగా పాల్గొనటం విశేషం. ఈ వేడుకలు నాలుగు రోజులపాటు జరుగుతాయి. ప్రతినెలా పౌర్ణమి పూజలు కూడా ఘనంగా నిర్వహిస్తున్నారు.


నల్లతంగాళ్ తన పిల్లలతో ఆత్మహత్య చేసుకున్న బావి

ఎలా వెళ్ళాలి?

నల్లతంగాళ్ ఆలయం సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీవిల్లిపుత్తూరుకు 25కిలోమీటర్ల దూరంలో ఉంది. రాజధాని నగరం చెన్నై సహా పలునగరాల నుండి శ్రీవిల్లిపుత్తూరు వెళ్లడానికి బస్సులు న్నాయి. శ్రీవిల్లిపుత్తూరు చేరిన తర్వాత అక్కడి నుండి టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీల్లో బయలుదేరి శ్రీవిల్లిపుత్తూరు-మదురై రహదారిలో ఉన్న వద్దిరాయిరుప్పు ప్రాంతానికి చేరుకోవచ్చు. అక్కడినుండి కూతవేటుదూరంలో పచ్చటి పొలాల నడుమ ఉన్న నల్లతంగాళ్ ఆలయాన్ని కాలినడకనే చేరుకోవచ్చు.ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6నుండి సాయంత్రం 6 గంటల దాకా తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

కొత్త నటీనటులతో 'మద్రాస్ మహల్'


'మద్రాస్ మహల్' షూటింగ్ ప్రారంభోత్సవ దృశ్యం

కొత్త నటీనటులతో 'మద్రాస్ మహల్' చిత్రం షూటింగ్ సంప్రదాయ పూజా కార్యక్రమంతో నగరంలో తాజాగా ప్రారంభమైంది. బసవ ప్రొడక్షన్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవి శ్రీను దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన గతంలో 'భాను' అనే విజయవంతమైన చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇపుడు కొత్త నటీనటులతో సినిమాకు శ్రీకారం చుట్టారు. హీరోయిన్‌గా అక్షరను ఎంపిక చేయగా సంజయ్‌తో పాటు మరో ముగ్గురు యువకులు హీరోలుగా నటిస్తున్నారు. వినోద్ నంబియార్, ఎస్.మురుగన్ నిర్మాతలు. ఈ చిత్రం పూజా కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. ప్రముఖ నటుడు, నిర్మాత మెర్క్యురీ సత్య మాట్లాడుతూ, ' ఈ రోజుల్లో చిన్న నిర్మాతలు లభించడం చాలా అరుదు. భారీ బడ్జెట్‌తో కాకుండా పరిమిత ఖర్చుతో ఈ సినిమాను పూర్తి చేయాలని దర్శకుడు శ్రీను ప్లాన్ చేశారు. విద్యార్థి సమాజం నానాటికీ దిగజారిపోతుందనీ, వారిని మంచి మార్గంలోకి ఎలా తీసుకుని రావొచ్చన్న చక్కటి కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. 'ఈ చిత్రాన్ని ఉత్తర చెన్నై నేపథ్యంలో రూపొందిస్తున్నట్టు దర్శకుడు జీవీ శ్రీను తెలిపారు. పూజా కార్యక్రమానికి హాజరైన పలువురు సినీ ప్రముఖులు చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

చిత్రజ్యోతి

దేవుడు ఎంతో అందాన్నిచ్చాడు

● రకుల్ ప్రీత్ సింగ్

తనకు దేవుడు ఎంతో అందాన్ని ఇచ్చాడని, అందువల్ల అందం కోసం ఆపరేషన్లు చేయించుకోవాల్సిన అవసరం, అగత్యం తనకు లేదని హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు.. 'దీరన్ అధికారం ఒండ్రు', 'ఎన్‌జీకే', 'అయలాన్', 'ఇండియన్-2' వంటి పలు చిత్రాల్లో నటించి తమిళ ప్రేక్షకులకు దగ్గరైన రకుల్ .. టాలీవుడ్, బాలీవుడ్‌లో కూడా రాణిస్తున్నారు. తన ప్రియుడిని వివాహం చేసుకున్న తర్వాత కూడా సినిమాల్లో కొన సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మరింత అందంగా కనిపించేందుకు సర్జరీ చేయించుకున్నట్టు ప్రచారం సాగుతోంది. దీనిపై ఆమె తాజాగా స్పందిస్తూ, 'ఎలాంటి సర్జరీలు చేసుకోలేదు. కారణం.. దేవుడు నాకు ఎంతో అందాన్ని ఇచ్చాడు. మరింత అందంగా కనిపించాలన్న పరిస్థితి లేదు. అలాగని ఫేషియల్ సర్జరీలు చేసుకునే వారిని నేను తప్పు పట్టడం లేదు. అది వారిష్టం. నావరకైతే అలాంటి పరిస్థితి రాలేదు. నేను ఎలాంటి సర్జరీలు చేయించుకోలేదు' అని ఆమె వివరించారు.





'లెవెన్' ఆడియో రిలీజ్ దృశ్యం

నవీన్ చంద్ర హీరోగా 'లెవెన్'

● ట్రైలర్ రిలీజ్ చేసిన కమల్ హాసన్

నవీన్ చంద్ర హీరోగా ఏఆర్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై లోకేష్ అజిల్స్ దర్శకత్వంలో రూపొంది, డి.ఇమ్మాన్ సంగీతం సమకూర్చిన 'లెవెన్' చిత్రం ట్రైలర్ అగ్రనటుడు కమల్ హాసన్ తన సామాజిక మాధ్యమం ద్వారా రిలీజ్ చేశారు. అలాగే, ఆడియోను అనేక మంది సినీ ప్రముఖుల సమక్షంలో విడుదల చేశారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో సీనియర్ దర్శకనటుడు కె.భాగ్యరాజ్, నిర్మాతలు కలైపులి ఎస్.థాను, టీజీ త్యాగరాజన్, టి.శివ, సహ నిర్మాత గోపాలకృష్ణన్, దర్శకులు అమీర్, సెల్వ రాఘవన్, ప్రభు సాల్మన్, ఏఎల్ విజయ్, విశాల్ వెంకట్, బద్రి, రమేష్ కృష్ణన్, పంపిణీదారులు ఫైవ్‌స్టార్ సెంథిల్, అళగర్‌స్వామి, అరుల్‌పతి, తేనప్పన్, సరిగమ ఐశ్వర్య, సంజయ్ వాద్య, ముఖేష్ మెహతా, మీనా చాబ్రియా, కృష్ణారెడ్డి, కదిరేశన్, రాజ్ టీవీ రవి, రఘునందన్ తదితరులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. 'నేను తెరకెక్కించే చిత్రాలకు, నేను చూసే చిత్రాలకు పొంతనే ఉండదని కె.భాగ్యరాజ్ అన్నారు. 'లెవన్' ట్రైలర్ చూస్తుంటేనే ఆసక్తికరంగా ఉంది. ఈ నెల 16వ తేదీన తప్పకుండా సినిమా చూస్తాను' అని పేర్కొన్నారు.

మాట్లాడే పదాల శక్తిని తెలిపే 'ఆగకడవన్'

రోజువారీ దినచర్యల్లో మనం మాట్లాడే ప్రతి మాట శక్తిని తెలిపేదిగా 'ఆగకడవన్' తెరకెక్కుతోంది. సారా కలైకూడమ్ పతాకంపై అనితా లియో, లియ వె.రాజా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రచన, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ధర్మ. దర్శకుడు అధిరన్ సురేష్ ప్రధాన పాత్ర పోషించగా, విన్సెంట్, సీఆర్ రాహుల్, మైఖేల్, రాజ శివన్, సతీష్ రామదాస్, దక్షిణ్, నివాస్ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'తమ వాహనం టైరు పంక్చర్ కావడంతో హైవే పై చిక్కుకుని తన స్నేహితుడితో కలిసి సాయం కోసం ఎదురు చూస్తున్న హీరోకు ప్రాణాపాయం సంభవించే వరుస సంఘటనలు ఎదురవుతాయి. వీటి నుంచి వారిద్దరూ తప్పించుకున్నారా? లేదా? అన్నది సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించాం. నిర్మాణాంతర కార్యక్రమాలన్నీ పూర్తి చేసి ఈ నెలలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.


'ఆగకడవన్'లో ఓ దృశ్యం

నందోస్ ఫ్లేమ్‌గ్రిల్డ్ చికెన్ రెస్టారెంట్ ప్రారంభం

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీ మాల్‌లో ఫ్లేమ్-గ్రిల్డ్, పెరి పెరి చికెన్ రెస్టారెంట్ 'నండోస్' అట్టహాసంగా ప్రారంభమైంది. సౌత్ ఆఫ్రికన్ బ్రాండ్ పెరి-పెరి సువాసనలతో కూడిన చికెన్ వంటలతో ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి నగరవాసులను ఆకట్టుకున్న నండోస్ చెన్నైలో తన శాఖ ఏర్పాటు చేయడం తమకెంతో ఆనందంగా ఉందని రెస్టారెంట్ నిర్వాహకులు తెలిపారు. చెన్నై వాసులకు కూడా తమ చికెన్ వంటకాలు మరింతగా ఆకట్టుకుంటాయన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు




కార్మికుల దినోత్సవం సందర్భంగా రిప్పన్‌భవనంలో గురువారం పారిశుధ్య కార్మికులకు సహాయాలు అందజేస్తున్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మహేష్‌కుమార్ తదితరులు

తిరుత్తణిలో ఘనంగా ధ్వజారోహణం



తిరుత్తణి, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ క్షేత్రంలో చిత్తిరై బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో ప్రధాన అంశమైన ధ్వజారోహణ ఘట్టాన్ని గురువారం ఉదయం ఆలయ అర్చకులు నిర్వహించారు. పది రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో ప్రతిరోజు మురుగన్‌ను ప్రత్యేకంగా అలంకరణలతో వివిధ వాహనంలో కొలువుదీర్చి ఆలయ మాడవీధుల్లో ఊరేగించనున్నారు. మే 2 నుంచి 8వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం వాహన సేవల్లో స్వామివారు భక్తులను అనుగ్రహిస్తారు. మే 9వ తేదీ తిరుకల్యాణం, మే 10వ తేదీ ఉత్సవాల ముగింపు జరుగనుందని ఆలయ జాయింట్ కమిషనర్ కె.రమణి ఓ ప్రకటనలో తెలిపారు.



శంకరన్‌కోవిల్‌లో చిత్తిరై ఉత్సవాల ప్రారంభం


శంకరన్‌కోవిల్‌లో దీపారాధన చేస్తున్నఅర్చకులు - వేదగిరీశ్వరాలయంలో ధ్వజారోహణం - వేదగిరీశ్వరస్వామి

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ శంకర నారాయణ స్వామి ఆలయంలో చిత్తిరై ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆ ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆలయ అర్చకులు, వేదపండితులు వేకువజాము 5.40 గంటలకు ధ్వజారోహణం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంకే శాసనసభ్యుడు రాజా, ఆ పార్టీ నగర శాఖ కార్యదర్శి ప్రకాష్, ఆలయట్రస్టు బోర్డు సభ్యులు ముప్పిడాది, న్యాయవాది కాళిరాజ్, జయకుమార్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. ధ్వజారోహణం నేపథ్యంలో బుధవారం పెరుంకోడూరులోని తిరుకోడి అయ్యనార్ ఆలయ ఏనుగు గోమతి మన్ను తీసుకొచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 4 రాత్రి స్వామి, అమ్మవార్లు వృషభవాహనంలో ఊరేగి 63 మంది నాయన్మార్లకు దర్శనమిచ్చే వేడుకలు జరుగుతాయి. 7వ తేదీ రాత్రి స్వామి, అమ్మవారు, నటరాజస్వామి అరుణ వర్ణ పట్టువస్త్రాలు ధరించి భక్తులకు దర్శనమిస్తారు. 8 ఉదయం నటరాజ స్వామి ఆకుపచ్చరంగు పట్టువస్త్రం ధరిస్తారు. ఈ వేడుకలలో ప్రధాన ఘట్టమైన మహా రథోత్సవం ఈ నెల 9 ఉదయం 9 గంటలకు జరుగుతుంది.

వేదగిరీశ్వరాలయంలో..

చెంగల్పట్టు జిల్లా తిర్కుళికుండ్రంలోని అరుళ్మిగు త్రిపురసుందరి సమేత వేదగిరీశ్వరాలయంలో చిత్తిరై ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వేదమలై, పక్షితీర్థం, శంఖుతీర్థం, ఇంద్రపురి, వేదపురి అని వివిధ నామాలతో పిలిచే తిరుక్కళికుండ్రం వేదగిరీశ్వరాలయంలో ప్రతియేటా చిత్తిరై ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ యేడాది ఏప్రిల్ 30న గణపతి హోమంతో ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం ధ్వజారోహణం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, యాగపూజలు, మహాదీపారాధన జరిగాయి. అనంతరం వేదగిరీశ్వరస్వామి (ఉత్సవమూర్తి) సర్వాలకరణశోభితులైన ధ్వజస్తంభ మంటపంలో వేంచేశారు. వేదపండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు, ఆలయ ప్రధానార్చకులు ధ్వజారోహణం చేశారు. ఈ నెల 11 వరకు జరిగే ఈ ఉత్సవాలలో ప్రధానఘట్టమైన పంచరథోత్సవాలు ఈ నెల 7న జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయ కార్యనిర్వహణాధికారి పువియరసు, తక్కర్ కుమారవేల్, మేనేజర్ విజయన్, ఆలయ శివాచార్యులు కలిసి భక్తులకు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

సభ్యుల సహకారంతోనే సంఘాల బలోపేతం

ప్యారీస్, మే 1 (ఆంధ్రజ్యోతి): సంఘాల పురోగతి సభ్యుల సంపూర్ణ సహకారం ఆధారపడి వుంటుందని, దానికి వైశ్య సంఘం ప్రత్యేక్ష నిదర్శనమని ప్రముఖ పారిశ్రామికవేత్త డి.బాలకృష్ణ కొనియాడారు. జార్జిటౌన్ గిడ్డంగి వీధిలోవున్న సదరన్ ఇండియా వైశ్య సంఘం (శివ) 121వ వార్షిక ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. శివ అధ్యక్షులు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పారిశ్రామికవేత్త డి.బాలకృష్ణ అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. ముందుగా సంఘ అధ్యక్షులు అజంతా శంకర్‌రావు తన అధ్యక్షోపన్యాసంలో శివ చరిత్రను సభకు వివరించారు. 12 దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన ఈ సంఘం, సమాజ సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. దాతలు, ధర్మసంస్థల సహకారంతో సేవా కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. శివ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పూవ్వాడ అశోక్‌కుమార్, కోశాధికారి పెసల రమేష్‌తో పాటు సీనియర్ సభ్యులతో కలిసి ముఖ్యఅతిథిని అజంతా శంకర్‌రావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రపంచ శాంతి కోసం ప్రార్థించారు. అదేవిధంగా కశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన మృతుల ఆత్మశాంతించాలని ప్రార్థించారు.


ముఖ్యఅతిథి బాలకృష్ణను సత్కరిస్తున్న అజంతా శంకర్‌రావు తదితరులు